
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 20 నవంబరు 2024



బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థుల రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు వర్సిటీలోని 2 కేంద్రాలతో పాటు పాలకొండ, టెక్కలి, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాజాంలోని జీసీఎస్ఆర్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్, సప్లిమెంటరీ కలిపి మొదటిరోజు 1,165 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల22 వరకు కొనసాగుతాయి.

ఒకపూటతో సరి..

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంతమాత్రంగానే వైద్య సేవలు
- మధ్యాహ్నం విధులకు హాజరుకాని వైద్యులు
- సొంత క్లినిక్‌లకే ప్రాధాన్యం
- రాత్రి సమయాల్లో కేసులన్నీ రెఫర్
- రోగులకు తప్పని ఇబ్బందులు


శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మందుల కోసం రోగుల పడిగాపులు

ఆంధ్రజ్యోతి విజిట్


నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యుడి కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు

ఒక వైద్యుడు 10.30 గంటలకు వస్తాడు. మరొకరు 11 గంటలకు.. ఇంకొకరు మరో సమయానికి వస్తారు. ఎవరు కూడా సమయపాలన పాటించరు. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మాత్రమే రోగులకు అందుబాటులో ఉంటారు. తరువాత సొంత క్లినిక్‌కు వెళ్లిపోతారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత ఎవరూ అందుబాటులో ఉండరు. అత్యవసరమైన రోగులకు సాయంత్రం నాలుగు గంటల తరువాత, మిగిలిన సమయాల్లో కాల్ ద్వారా తెలియజేస్తే డ్యూటీ వైద్యులు వచ్చి సేవలు అందిస్తారు. ఇలా.. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంతమాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయి. ఎక్కువ కేసులను రెఫరల్ చేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో వైద్యుల కొరత వేధిస్తుంది. సరిపడ ఫ్యాన్లు లేక, వేడినీరు దొరక్క రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలు విషయాలు వెలుగు చూశాయి.

6లో

ఐఏసీలో పోలీసుల తనిఖీలు

- నిర్వాహకుడు జీవీ రమణపై ఫిర్యాదు
- సంస్థ అనుమతులపై పోలీసుల ఆరా
- మహిళా ఎస్ఐకు రూ.5లక్షల టోకరా!
- విచారణ జరుపుతున్నామని ఎస్పీ వెల్లడి


ఐఏసీ నిర్వాహకుడు రమణను విచారిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులను ఇండియన్ ఆర్మీ కాలింగ్ అకాడమీ (ఐఏసీ) నిర్వాహకులు మోసగిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద తన బృందంతో సదరు అకాడమీలో తనిఖీలు నిర్వహించారు. శిక్షణ, వసతి సౌకర్యాలు, సంస్థ అనుమతులు తదితర వాటిపై డీఎస్పీ ఆరా తీశారు. తనిఖీ లు చేసేటప్పుడు నిర్వాహకుడు రమణ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అకాడమీలోని బాలికలు ఉండే వసతి గదులకు మూడు సీసీ కెమెరాలు ఉండటంపై కూడా డీఎస్పీ ఆరా తీశారు. బాలికలు ఉండే వసతి గృహంలో ఇలా కెమెరాలు పెట్టడం చట్టరీ త్యా నేరమని పోలీసులు చెబుతున్నారు. కెమెరా యాక్సెస్ మహి ళా ఇన్‌చార్జి వద్ద ఉంటుందని చెప్పి తన మొబైల్‌కు రమణ పెట్టు కున్నారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇటీవల కవిటి ప్రాంతానికి చెందిన బాలికను రమణ వేధించినట్లు హాస్టల్‌లో ఉన్న బాలికలు పోలీసులకు వివరించగా దీనిపై డీఎస్పీ విచారణ చేపట్టారు.

- ఆమదాలవలస నియోజకవర్గంలోని ఓ మండల పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా ఎస్ఐకి కూడా రమణ టోకరా వేసినట్లు డీఎస్పీ విచారణలో తేటతెల్లమైంది. తొలుత తన అకాడమీలో ఎస్ఐ భర్తకు భాగస్వామ్యం ఇప్పిస్తానని చెప్పి రూ.10 లక్షలు తీసుకుని టోకరా వేశారని తెలుస్తోంది. ఇందులో రూ.5లక్షలు వెనక్కి ఇచ్చినట్లు సమాచారం. దీనిపై (మిగతా 6వ పేజీలో..)

ఇవి నిజంగా నివాసాలంట!

- గృహాలకు అనుమతి.. నిర్మించేది వాణిజ్య సముదాయాలు
- ప్రతి ఏటా గ్రామ పంచాయతీకి రూ.కోట్ల ఆదాయం గండి
- పన్ను విధింపులో మాయాజాలం.. సిబ్బంది చేతివాటం
- ఇక నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవి కోకొల్లలు
- ఆదాయం లేక మరుగున పడిన అభివృద్ధి



- స్థానిక పెద్దపేటలో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మూడు నెలలుగా రెండు అంతస్థుల భవనం నిర్మాణం సాగుతోంది. పంచాయతీ నుంచి ఏడాది క్రితం ఇంటి నిర్మాణాలకు కోసం అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతం షాపులను నిర్మిస్తున్నా రు. ఇంటి నిర్మాణానికి అనుమతి పొంది.. ఇలా షాపులను నిర్మాణం చేయడంతో పంచాయతీ సుమారు రూ.40వేల ఆదాయం కోల్పోయింది. నిర్మాణం పూర్తయిన తరువాత కూడా ఇళ్ల కేటగిరిలోనే పన్ను వసూళ్లు చేస్తారు.



- కొత్తవీధిలో ఉన్న ఓ భవనం.. బయటకు ఒక్కటిగా కనిపిస్తున్నా.. లోపల ఆరు ఇళ్లు ఉన్నాయి. ఈ ఆరు ఇళ్లకుగాను ఒకే ఇంటికి పంచాయతీ పన్ను వసూళ్లు చేస్తోంది. విద్యుత్ కనెక్షన్ కోసం మీటర్లు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఆరు ఇళ్లకు పన్ను ఫిక్సింగ్ చేయాల్సింది పోయి.. ఒకే ఇంటికి పన్ను వసూళ్లు చేస్తున్నారు. దీంతో పంచాయతీ వేలాది రూపాయలు పన్ను రూపంలో ఆదాయం కోల్పోతోంది.



- నేతాజీ వీధిలో 60 ఇళ్ల వరకు ఉన్నాయి. ఒకటిరెండు మినహా అన్నీ నివాస గృహాల పేరుతో పంచాయతీ నుంచి అనుమతి పొందారు. తీరా ప్రస్తుతం ఈ వీధిలో దాదాపు 90శాతం కమర్షియల్ షాపులుగా మార్చివేశారు. ఒక్క నేతాజీ వీధిలోనే కాకుండా మారుతీనగర్ -1, కొత్తవీధి, కొవెలవీధి, మఠంవీధి, బజారువీధి, లచ్చుమున్నపేట, జోగిపేట, పెద్దపేట, శ్రీనివాసనగర్ తదితర వీధుల్లో వందలాది గృహనిర్మాణాలతో పంచాయతీ నుంచి అనుమతులు పొంది కొందరు వాణిజ్య సముదాయాలుగా మార్చివేశారు. దీంతో పంచాయతీకి ఒక్కొక్క ఇంటికి ఏడాది రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పన్ను రూపంలో ఆదాయంకు గండి పడుతోంది. ఇలా పట్టణంలో 2వేల వరకు నివాస గృహాల పేరుతో నిర్మాణాలు చేపట్టి.. వాణిజ్య సముదాయాలను నిర్వహిస్తున్నారు.



నరసన్నపేట పట్టణం

నరసన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట మేజర్ పంచాయతీల్లో 88 వీధులు ఉన్నాయి. గృహాలు 12,356 ఉండగా 48,532 మంది నివసిస్తున్నారు. మొత్తం గృహసముదాయాల్లో 2వేల పైగా వాణిజ్యసముదాయాలు, పెద్దపెద్ద షాపులు నిర్వహిస్తున్నారు. ఇంటిపన్ను ఫిక్సింగ్ చేసే సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చదరపు అడుగుకు రూ.110 నుంచి 170 వరకు నిర్ణయించాలి. అదే వాణిజ్య సముదాయాలకు చదరపు అడుగుకు రూ.350 నుంచి రూ.550 వరకు పన్ను విధించాలి. కానీ నరసన్నపేట పంచాయతీలో పన్ను విధించే చేసే కొందరు అధికారులు యాజమానులతో కుమ్మక్కై పెద్దపెద్ద ఇళ్లకు తక్కువ పన్ను వేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పన్ను నిర్ధారించే వారికి యాజమానులు అంతో ఇంతో సమర్పించుకోవడం పరిపాటిగా మారింది. ఈ విషయం బహిరంగంగా తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పన్ను ఫిక్సింగ్ చేసినవారిలో కొందరు కాంట్రాక్టు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు.

రూ.కోటిన్నర ఆదాయానికి చిల్లు

- పంచాయతీ సిబ్బంది నిబంధనల మేరకు పన్ను ఫిక్సింగ్ చేస్తే ఏడాదికి రూ.2.5కోట్ల ఆదాయం వస్తుంది. కానీ వారు మామూళ్లకు లొంగిపోవడంతో రూ.60 లక్షల నుంచి రూ.70లక్షలు వరకు మాత్రమే ఇంటిపన్ను రూపంలో వస్తుంది. కొన్ని వీధుల్లో పంచాయితీ సిబ్బంది అసలు ఇంటి పన్ను వసూళ్లు చేయడం లేదు. కానీ ఆ వీధులకు అన్ని సౌకర్యాలు అందజేస్తున్నారు. ఈ వీధుల వైపు పన్ను ఫిక్సింగ్ చేసేందుకు కన్నెత్తి చూడరు.
- ఇక ఇంటి నిర్మాణాలకు పంచాయతీ ప్లాను అనుమతి ఇస్తుంది. ఇందుకుగాను నిర్మాణ స్థలం మార్కెట్ విలువలో 5శాతం పంచాయతీకి చెల్లించాలి. అదే వాణిజ్య సముదాయం, కమర్షియల్ నిర్మాణాలు అయితే 15శాతం వరకు పంచాయతీకి కట్టి అనుమతి తీసుకోవాలి. ప్లాన్‌లో కూడా కమర్షియల్ భవనాలకు పార్కింగ్ స్థలం, అగ్నిమాపక శాఖ అధికారులు నుంచి (మిగతా 6వ పేజీలో..)

ఒడిశా వ్యర్థాలు.. ఏపీకి అనర్థాలు

- మహేంద్ర తనయలో కలుస్తున్న ఒడిశా మురుగునీరు, చెత్త
- పాతపట్నంలో కలుషితమవుతున్న నదీ జలాలు
- భూగర్భ జలాలు కూడా..
- సాగుకు దూరమైన రైతులు

పాతపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి వస్తున్న మురుగునీరు పాతపట్నం వద్ద మహేంద్ర తనయ నదిలో కలుస్తుంది. దీంతో నదీ జలాలతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఈ కాలువకు ఆనుకుని ఉన్న వందలాది ఎకరాల భూముల్లోకి వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. దీనివల్ల రైతులు ఆ పొలాల్లో పంటను పండించడం మానేశారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడి పట్టణాన్ని, మన రాష్ట్రంలోని పాతపట్నం పట్టణాన్ని మహేంద్ర తనయ నది వేరుచేస్తుంది. దాదాపుగా ఇవి జంట పట్టణాలుగా ఉంటాయి. రెండు పట్టణాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఒడిశా కొండల్లో పుట్టిన మహేంద్ర తనయ గజపతి జిల్లా మీదుగా పాతపట్నం నియోజకవర్గంలో ప్రవహించి హిరమండలం వద్ద వంశధారలో కలుస్తుంది. అటు ఒడిశాతో పాటు ఇటు ఆంధ్రాలో వేలాది ఎకరాలకు మహేంద్ర తనయ ద్వారా సాగు నీరు అందుతుంది. అయితే, పర్లాకిమిడి జిల్లా కేంద్రం కావడంతో అక్కడి అన్ని మురుగు కాలువల మార్గాలను మహేంద్ర తనయ వైపే చూపించారు. మురుగునీటితోపాటు ప్లాస్టిక్, ఆస్పత్రుల వ్యర్థాలు నదిలో చేరుతున్నాయి. ఫలితంగా ఈ నదీ జలాలు ఆంధ్రాలోకి వచ్చేసరికి కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఆంధ్రాలో నది పొడవునా చెత్త, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. దీంతో పాతపట్నం మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది, పాసిగంగుపేట తదితర గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులు కాలుష్య ప్రభావానికి గురవుతున్నాయి. భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి. వేసవిలో దాహం కేకలు చేటుచేసుకొనే రోజుల్లో మహేంద్ర తనయ నది వైపు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామస్థులు నిత్యం దుర్గంధం మధ్యే జీవనం సాగిస్తున్నారు. ఒడిశా ప్రాంతంలో మురుగు నీరు పంట పొలాల్లోకి వెళ్లకుండా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో రైతులు ఆకాలువకు ఆనుకొని ఉన్న పొలాల్లో చక్కగా పంటలు పండిస్తున్నారు. కానీ, ఆంధ్రాలోని పాతపట్నం మండల పరిధిలోకి వచ్చేసరికి ఈవ్యర్థాలను అడ్డుకునేందుకు గానీ, నియంత్రించేందుకు గానీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీని కారణంగా (మిగతా 6వ పేజీలో..)


పర్లాకిమిడి నుంచి వస్తున్న మురుగు నీరు, వ్యర్థాలు


కె.గోపాలపురం వద్ద పొలాల్లోకి వెళ్తూ..



ఒకపూటతో సరి..

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంతమాత్రంగానే వైద్య సేవలు
- మధ్యాహ్నం విధులకు హాజరుకాని వైద్యులు
- సొంత క్లినిక్‌లకే ప్రాధాన్యం
- రాత్రి సమయాల్లో కేసులన్నీ రెఫర్
- రోగులకు తప్పని ఇబ్బందులు

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంతమాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్కపూటే వైద్యులు సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం విధులకు డుమ్మా కొడుతున్నారు. సొంత క్లినిక్‌లకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలు అంశాలు వెలుగు చూశాయి.

రెఫరల్ ఆస్పత్రి..

కోటబొమ్మాళి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక 30 పడకల సామాజిక ఆసుపత్రి రెఫరల్ ఆస్పత్రిగా పేరుపొందింది. ఎంతటి చిన్న కేసు అయినా నామమాత్రంగా సేవలు అందించి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లు మాత్రమే ఇక్కడ పని చేస్తున్నారు. ఇందులో ఒక సర్జన్ నరసన్నపేట ఆసుపత్రి నుంచి డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఈయన రెండు రోజులకోసారి ఇక్కడకు వస్తున్నారు. ఫ్యాన్లు తగినన్ని లేకపోవడంతో రోగులు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు.



కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రి

అదే నిర్లక్ష్యం..

అరసవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. మంగళవారం ఓ రోగిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువచ్చారు. రోగిని అంబులెన్స్ నుంచి దించి, స్ట్రెచర్‌పై తీసుకువెళ్లేందుకు సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బంధువులే రోగిని అంబులెన్సు నుంచి దించి స్ట్రెచర్‌పై తీసుకువెళ్లడం కనిపించింది. ఓపీ కౌంటర్ల వద్ద కూడా జనం బారులు తీరారు. వైద్యసేవల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి. ఆర్ఎంవో ఫోన్ నెంబరును ఓపీ కౌంటర్ల వద్ద అత్యవసర సేవలందించే చోట, అన్ని విభాగాల వద్ద ఏర్పాటు చేయాలి. కానీ, ఎక్కడా ఆ పరిస్థితి కానరావడం లేదు.



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

నిరుపయోగంగా ఎక్స్‌రే మిషన్

రణస్థలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొండములగాం సీహెచ్‌సీ నిత్యం రోగులతో రద్దీగా ఉంటుంది. రోజుకు 150 నుంచి 200 వరకూ ఓపీ ఉంటుంది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' 10:30 గంటలకు విజిట్ చేయగా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అండుబాటులో ఉన్నారు. అదనపు భవనాలు లేక లక్షలాది రూపాయిల విలువ చేసే ఎక్స్‌రే మిషన్ నిరుపయోగంగా ఉంది. జరల్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది.



కొండములగాంలో సీహెచ్‌సీలో రోగులు



మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ



ఆమదాలవలస సామాజిక ఆస్పత్రి

డాక్టర్లు ఫుల్.. రోగులు నిల్

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస సామాజిక ఆరోగ్య కేంద్రంలో 8 మంది వైద్యులకు గాను ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్క చిన్న పిల్లల డాక్టర్ తప్ప అన్ని విభాగాలకూ వైద్యులు ఉన్నారు. అలాగే, 19 మంది వైద్య సిబ్బంది కూడా ఉన్నారు. అయితే, ఇక్కడ మూడు వార్డుల్లోని 30 పడకల మీద మంగళవారం ఒక్క రోగి కూడా లేరు. ప్రతిరోజూ కేవలం వంద లోపే ఓపీ నమోదవుతుంది. ఉదయం మాత్రమే ఇక్కడ సేవలు అందుతున్నాయి. రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. ఆ సమయంలో రోగులకు సిబ్బంది సేవలందిస్తున్నారు. ఎక్కువ శాతం కేసులను శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. ఆస్పత్రి ఏర్పడి 20 ఏళ్లు దాటినా జనరేటర్ లేదు. దీంతో విద్యుత్ లేని సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 'ఆసుపత్రి ప్రారంభం నుంచి ఓపీ ఈ విధంగానే ఉంటుంది. పరిసర ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉండడంతో ప్రజలు అక్కడే సేవలు పొందుతున్నారు. అత్యవసర వైద్య సేవలకే రోగులు ఇక్కడికి వస్తున్నారు.' అని డాక్టర్ డి.హరిణి తెలిపారు.

ఒంటిపూట ఆసుపత్రి...

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వాసుపత్రిలో మొత్తం 8 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. 50 పడకల ఆసుపత్రిగా ఉన్న సీహెచ్‌సీలో 12 మంది వరకూ వైద్యాధికారులు ఉండాలి. కానీ, ఇక్కడ 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అందులో ముగ్గురు వైద్యులు మంగళవారం ఉదయం సమయానికి ఆస్పత్రికి వచ్చారు. 10 గంటలకు మరో ఇద్దరు వైద్యాధికారులు వచ్చారు. డెంటల్ వైద్యాధికారిణి రోజు తప్పించి రోజు ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారు. మరో వైద్యాధికారిణి చైల్డ్ లీవ్‌లో ఉండగా, మరొకరు కనిపించలేదు. సమయానికి ఐదుగురే విధులు నిర్వహిస్తుండగా, 11.30 గంటలకు ఒక వైద్యాధికారిణి ఇంటికి వెళ్లిపోయారు. సిబ్బందిని ప్రశ్నించగా రౌండ్స్‌కు వెళ్లినట్లు తెలిపారు. అత్యవసర కేసులను టెక్కలి జిల్లా ఆసుపత్రి, విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తున్నారు. ఓపీ నామమాత్రంగా ఉంటుంది.



మంగళవారం సాయంత్రం 3.15 గంటలకు ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల గదులు

అరకొరగా సేవలు..

నరసన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయి. ఉదయం 10 గంటలకు రావాల్సిన వైద్యులు 10.30 నుంచి 11 గంటల మధ్యలో వస్తున్నారు. మంగళవారం 20 మందికి గాను కేవలం 12 మంది వైద్యులే వచ్చారు. వీరిలో కొందరు మధ్యాహ్నం 1 గంటకు తిరుగుముఖం పట్టారు. మధ్యాహ్నం 2 గంటలకు రావాల్సిన వైద్యులు విధులకు డుమ్మా కొట్టారు. ఓ గర్భిణి వైద్యురాలి కోసం సాయంత్రం 4 గంటల వరకు వేచి చూసింది. అయినా రాకపోవ డంతో ఆమెకు నర్సింగ్ సిబ్బంది వైద్యసేవలు అందించారు. శ్రీకాకుళం, కోటబొమ్మాళి, నరసన్నపేట, టెక్కలి తదితర ప్రాంతాల్లో కొందరి వైద్యులకు సొంత క్లినిక్‌లు ఉన్నాయి. దీంతో వారు ఆస్పత్రికి ఆలస్యంగా వస్తున్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది 96 మందికి గాను 88 మంది పనిచేస్తున్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సివిల్ సర్జన్, జనరల్ మెడిషన్, సీఏస్ ఆర్ఎంవో, డిప్యూటీ క్లినిక్ సర్వీసు పోస్టులతో మరో నాలుగురిని నియమించాల్సి ఉంది. వార్డుల్లో తాగునీటి సదుపాయం లేదు. దీంతో రోగులు ఆరుబయట ఉన్న బోరుబావి మీద ఆధారపడుతున్నారు. ఈ బోరు కూడా రెండు రోజులుగా పనిచేయడం లేదు. గర్భిణులకు కాన్పు చేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 800 నుంచి రూ.2 వేల వరకు వసూ లు చేస్తున్నారు. అత్యవసర కేసులను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. రోగులకు సేవలు అందించకుండా సెల్‌ఫోన్ చూసుకుంటున్న ఓ డాక్టర్‌ను ఫొటో తీయడంతో.. ఆ వైద్యుడు 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై రుసరుస లాడారు. ఈయన మధ్యాహ్నం విధులకు డుమ్మా కొట్టాడు.

డాక్టర్ కోసం చూసినా రాలేదు



మూడు రోజులుగా జ్వరం, కాలునొప్పులతో బాధపడుతున్నాను. మధ్యాహ్నం 2 గంటలకు ఆసుపత్రికి వచ్చాను. ఓపీ రాసి ఇచ్చారు. డాక్టర్ కోసం చాలా సమయం నుంచి వేచి చూసినా రాలేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు.

-బంటుపల్లి మల్లమ్మ, వీరన్నాయుడు కాలనీ, నరసన్నపేట

ఉదయం నుంచి వేచి ఉన్నా..



నాకు 8 నెలలు నిండాయి. ఏదో సమస్య ఉందని వైద్యులు చెప్పారు. ఉదయం నుంచి వైద్యులు కోసం చూస్తున్నాను. ఉదయం చూశారు. మధ్యాహ్నం మళ్లీ చూస్తామన్నారు. 3.30 గంటలు అవుతున్నా డాక్టర్లు రాలేదు. మధ్యాహ్నం భోజనం లేదు. డాక్టర్ల కోసం పడిగాపులు కాయల్సి వస్తుంది.

-జి.లావణ్య, గర్భిణి, అచ్చుతాపురం, జలుమూరు మండలం

ఇద్దరే డాక్టర్లు..

ఇచ్ఛాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో వైద్యుల కొరతతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఈ 30 పడకల ఆసుపత్రిలో ప్రతిరోజూ 250 ఓపీ నమోదవుతుంది. వాస్తవానికి 8మంది వైద్యులు ఉండాలి. కానీ, ఇద్దరే ఉన్నారు. ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై వస్తున్నారు. డెలివరీ కేసులు వచ్చినపుడు ఒక్కరు మాత్రమే ఓపీ చూస్తున్నారు. ఆ సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. మత్తుమందు ఇచ్చే డాక్టర్ లేకపోవడంతో, డెలివరీకి వచ్చినవారు డబ్బులు చెల్లిస్తే ఆ డాక్టర్‌ను ఇక్కడకు తెస్తున్నారు. ఆస్పత్రిలో గ్రీజర్లు మూలకు చేరాయి. వేడి నీటి కోసం రోగులు బయట హోటళ్లను ఆశ్రయిస్తున్నారు.



ప్రసూతి వార్డులో బాలింతలు

ఇవి నిజంగా నివాసాలంట

(ఐదో పేజీ తరువాయి)

ధ్రువీకరణ పత్రం, లేబర్ సెస్ వంటివి చెల్లించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలి. కానీ పంచాయతీలో ప్లాను కోసం ఇంజనీరింగ్ వాళ్ల ఇచ్చిన అంచనాల సొమ్మును పంచాయతీకి చెల్లించి అంతే మొత్తంలో మామూళ్లు చెల్లిస్తే చాలు అనుమతులు ఇస్తున్నారు. నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన పిదప అనుమతులు ఇవ్వాలి. వాణిజ్య సముదాయాలకు 5శాతం మాత్రం చెల్లించి ఇంటి నిర్మాణాల పేరుతో ప్లాను తీసుకోవడంతో ఏటా రూ.20 లక్షల నుంచి రూ.30లక్షల వరకు పంచాయితీ ఆదాయం కోల్పోతోంది.

నిధులు లేక నీరసిస్తున్న నరసన్నపేట..

మేజర్ పంచాయతీ ఖజానాలో నిధులు నిండుకున్నాయి. ప్రతీ నెల పారిశుధ్య కార్మికుల జీతాలు కోసం ఆరాటం పడవల్సి వస్తోంది. ఈఏడాది ఇంతవరకు పన్ను ఫిక్సింగ్ చేయలేదు. పాతపన్ను ఫిక్సింగ్ మేరకు వసూళ్ల చేసేందుకు సిబ్బంది సమాయత్తమవుతున్నారు. పారిశుధ్యకార్మికులు, ఇతర సిబ్బంది జీతాలకు వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. వీధుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా పంచాయితీ నిధులతో ముందుకు వెళ్లలేని పరిస్థితి వచ్చిందని పాలకవర్గ సభ్యులు చెబుతున్నారు. ఆర్థికసంఘం, ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు తప్ప.. వీధి దీపాలకు, తాగునీటికొళాయి మరమ్మతులకు, దోమల నివారణ తదితర కార్యక్రమాలకు నిధుల కొరత వేధిస్తోంది.

పంచాయతీ ప్రక్షాళన ఎప్పుడు?

పంచాయతీలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు సిబ్బంది ఇక్కడే పనిచేయడం.. వారిలో కొందరు చక్రం తిప్పడంతో.. పన్నుల్లో ఆధాయం తగ్గిపోతోంది. రొటేషన్ పద్ధతిలో ఇక్కడ పనిచేసే సిబ్బంది ఐదేళ్లకు ఒక్కసారి మారుతూ రావడంతో పాతపరిచయాలతో పన్నులు, ఇంటినిర్మాణాల ప్లాన్లు, అక్రమనిర్మాణాలు వంటి వాటిలో వారే చక్రం తిప్పుతున్నారు. పన్ను ఫిక్సింగ్, అనుమతి పత్రాలు లేకుండా నిర్మాణాల్లో రాజకీయ నాయకులు సిఫార్సులతో పంచాయితీ ఆదాయం కోల్పోతోంది. మేజర్ పంచాయతీలో ప్రక్షాళన మరి ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

అనుమతి లేని నిర్మాణాలు అడ్డుకుంటాం..

మేజర్ పంచాయతీలో అనుమతి లేకుండా నిర్మాణాలు జరిగితే అడ్డుకుంటాం. పన్నుఫిక్సింగ్ అయితే ఇంకా చేయాల్సి ఉంది. నివాసాలు అనుమతి తీసుకుని వాణిజ్యసముదాయాలుగా మార్చిస్తే.. కన్వర్షన్ ఫీజులు వసూళ్ల చేస్తాం. ఇంటి పన్ను శాస్త్రీయంగా ఈఏడాది ఫిక్సింగ్ చేసి పంచాయతీ ఆదాయం పెంచుతాం.

-ద్రాక్షాయిణి, మేజర్ పంచాయతీ ఈవో, నరసన్నపేట

అసెంబ్లీలో సిక్కోలు సమస్యలు

- ప్రస్తావించిన జిల్లా ఎమ్మెల్యేలు

శాసనసభ సమావేశాల్లో మంగళవారం జిల్లా ఎమ్మెల్యేలు పలు సమస్యలపై మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఉద్యోగుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే రవికుమార్, ఏరియా ఆసుపత్రిలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే రమణమూర్తి, ఎన్టీఆర్ సుజల స్రవంతిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే శిరీష, ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని ఎమ్మెల్యే ఈశ్వరరావు కోరారు.

ఏరియా ఆసుపత్రిలో పనులు పూర్తి చేయాలి: బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో గత టీడీపీ హయాంలో 2019లో రూ.19 కోట్లతో అదనపు గదులు, ప్రహరీ నిర్మాణం తదితర పనులు చేపట్టి 55 శాతం పనులు పూర్తయ్యాయని, అయితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనుల్లో పురోగతి లేకపోవడంతో నేటికీ అలాగే ఉన్నాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం రాష్ట్ర శాసనసభలో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ.. పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నారన్నారు. పనుల వల్ల ప్రహరీని తొలగించారని, దీంతో పశువుల బెడద ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి పనులను పూర్తి చేసి రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతిని పునరుద్ధరించండి: గౌతు శిరీష

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో కిడ్నీ వ్యాధి బారిన పడిన గ్రామాల్లో గతంలో నిర్వహించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునరుద్ధరించి స్వచ్ఛ జలాలను అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మంగళవారం ఆమె అసెంబ్లీలో ఉద్దానం కిడ్నీ వ్యాధులు, స్వచ్ఛమైన తాగునీటిపై మాట్లాడారు. కిడ్నీ వ్యాధులు ప్రబలేందుకు తాగునీరు కలుషితం కావడం ఒక కారణమన్న కోణంలో 2014-2019 మధ్యలో అప్పటి సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాల్సిన ఎన్టీఆర్ సుజల స్రవంతిని పలాస, ఇచ్ఛాపునం నియోజకవర్గాల్లో ఏర్పాటుకు నిర్ణయించి మంజూరు చేశారన్నారు. ఏడు మండలాల్లో 135 యూనిట్లు ఏర్పాటు చేసి శుద్ధ జలాలు అందించారన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. టీడీపీ రూ.2కు 20 లీటర్ల నీటిని అందించగా ఆ ధరను పెంచారని, ఆ తరువాత ఈ యూనిట్లను పూర్తిగా బంద్ చేసి కేవలం 54 యూనిట్లకు పరిమితం చేశారన్నారు. ఏడు మదర్ బోర్లు కూడా పనిచేయడం లేదని, దీనివల్ల ఉద్దానం ప్రాంత ప్రజలు శుద్ధ జలాలు అందక మరలా సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని పునరుద్ధరించి కిడ్నీ బాధిత గ్రామాల్లో స్వచ్ఛ నీటిని అందించాలని కోరారు.





ఉత్తరాంధ్ర ఉద్యోగుల సమస్య పరిష్కరించాలి: కూన రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉద్యోగుల సమస్య పరిష్కరించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. మంగళవారం శాసనసభలో ఆయన రాష్ట్ర విభజన సమయంలో ఉద్యోగుల కేటాయింపు పరిపూర్ణంగా జరగకపోవడంతో పలువురు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. వీరిలో ఆమదాలవలస నియోజకవర్గంతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన ఎంతో మంది ఉన్నారని, దీనిపై ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో మంత్రి తెలియజేయాలని రవికుమార్ స్పీకర్‌ను కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలి: ఈశ్వరరావు

రణస్థలం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలో పరి శ్రమలు ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో లావేరు, జి.సిగడాం పూర్తిగా వ్యవసాధారిత మండలాలని తెలిపారు. ఇక్కడి రైతులు వరి, మొక్కజొన్న పంటలను విస్తారంగా సాగుచేస్తున్నారని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబు ఆదుకుంటామని హామీఇచ్చారని గుర్తుచేశారు. ఇక్కడ ఈ తరహా యూనిట్లు నెలకొల్పితే ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

ఐఏసీలో పోలీసుల తనిఖీలు

(ఐదో పేజీ తరువాయి)

కూడా డీఎస్పీ విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ఈ అకాడమీ వ్యవహారంపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఇండియన్ ఆర్మీ కాలింగ్ అకాడమీలో అవకతవకలు, నిర్వాహకుడి తీరుపై ఫిర్యాదు అందిందని, ఇందులో భాగంగానే తనిఖీలు నిర్వహించామని తెలిపారు. గతంలో కూడా ఉద్యోగాల పేరుతో జీవీ రమణ చేసిన మోసాలు, రూ.లక్షల్లో నగదు వసూళ్లపై పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ చెప్పారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామన్నారు. తనిఖీల్లో శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా వ్యర్థాలు.. ఏపీకి అనర్థాలు

(ఐదో పేజీ తరువాయి)

కె.గోపాలపురం, పాతపట్నం కాపువీధి రైతాంగానికి చెందిన సుమారు వంద ఎకరాల పంట భూముల్లో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి సాగుకు పనికిరాకుండా తయారయ్యాయి. ప్రతీ ఎన్నికల్లో పాలకులు ఈ సమస్య పరిష్కరిస్తామంటూ వాగ్దానాలు చేయడం, తరువాత మరచిపోవడం పరిపాటిగా మారింది.

చాలా ఇబ్బందులు పడుతున్నాం..

ఒడిశా నుంచి వచ్చే వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో కాలువ నుంచి వచ్చే తీవ్ర దుర్వాసనతో నరకం చూస్తున్నాం. ఒక్కోసారి మురుగు నీరు మా గ్రామంలోకి వచ్చేస్తుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-శేఖర్, రైతు, కె.గోపాలపురం.

త్వరలోనే సమస్య పరిష్కారం

ఇప్పటికే పర్లాకిమిడి పాలకులు, జిల్లాస్థాయి అధికారులతో చర్చలు జరిపాం. వారు సానుకూలంగా స్పందించారు. పర్లాకిమిడిలో వ్యర్థజలాల శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. పనులు కూడా చేపడుతున్నారు. అతి త్వరలోనే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుంది.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

అక్రమ మద్యాన్ని అరికట్టాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



ఇచ్ఛాపురం: ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ఒడిశా మద్యం ఆంధ్రా మీదుగా అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తతీసుకోవాలని, అక్రమ మద్యం అరికట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం పురుషోత్తపురం చెక్‌పోస్ట్, ఇచ్ఛాపురం ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బెల్ట్ షాపులు ఎవరు నిర్వహించినా వెంటనే కేసులు పెట్టి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని ఆదేశించారు.

● సోంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ డీ.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట సీఐ కె.బాబీ ఉన్నారు.

మహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి: ఎంపీడీవో

జి.సిగడాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మరుడుదొడ్లు నిర్మించుకొని మహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం జి.సిగడాంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎం.గౌరీశ్వరరావు, కార్యదర్శి సాహు పాల్గొన్నారు.

బాహుదా చానళ్లు వినియోగంలోకి తీసుకురావాలి

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బెందాళం అశోక్ చొరవ తీసుకొని నిధులు మంజూరు కృషిచేసి బాహుదా పరిధిలో గల 11 చానళ్లు పూర్తి స్థాయిలో మరమ్మతులుచేసి వినియోగంలోకి తీసుకురావాలని నియోజకవర్గ రైతు కుల సంఘ కన్వీనర్ జన్ని వరప్రసాద్ కోరారు. మంగళవారం బెల్లుపడలో రైతుకుల సంఘనాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ పనులకోసం పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే అశోక్ అసెంబ్లీలో ఇరిగేషన్ కోసం ప్రస్తావించడంపై హర్షం వ్యక్తంచేశారు.

వంతెన నిర్మించాలి

బాహుదాపై ఇచ్ఛాపురం వద్ద వంతెననిర్మించాలని పట్టణానికి చెందిన శ్యాం ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్రతోపాటు వ్యాపారులు, సీనియర్ సిటిజన్స్ క్రీడాకారులు, రిటైర్డ్ ఆర్మీమేజర్ డి.సుమన్, విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సురంగి రాజామైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాహుదా వంతెన కూలి ఏడాదిన్నర పూర్తయినా మరమ్మతులు తప్ప కొత్త వంతెన నిర్మించలేదని తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ బడుగు బలహీన వర్గాల గుండెల్లో చిరస్మరణీయంగా నిలుస్తారని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఆమె జయంతి పురస్కరించుకునిపూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, షన్ముఖరావు, దాలయ్య, అప్పారావు, శ్రీనివాసరావు, చింతాడ అప్పారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీలోని 23వ వార్డు లక్ష్ముడుపేటలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి సువ్వారి రవిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు నార్కోటిక్ డాగ్ సాయంతో పోలీసులు మంగళవారం తనిఖీచేశారు. గుణుపూర్- పూరి పాసింజర్‌లో, స్టేషన్‌లో ఉన్న బ్యాగ్‌లు, మూటలను డాగ్ సాయంతో పరిశీలించారు. గంజాయిని అరికట్టే కార్యక్రమంలో భాగంగా అన్నిచోట్ల తనిఖీలు చేపడుతున్నామని సీఐ మీసాల చిన్నామనాయుడు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ జాతీయ రహదారి వాటర్ ప్లాంట్ సమీపంలో ఇటీవల తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన పృథ్వీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన శ్రీకాళీమాత సేవా సమితిసభ్యులు అండగానిలిచారు. పృథ్వీ మృతిచెందడంతో తండ్రి నారాయణ అనారోగ్యానికి గురై మంచంపట్టాడు. ఈవిషయం తెలుసుకున్న శ్రీకాళీమాత సేవా సమితి సభ్యులు పృథ్వీ కుటుంబానికి రూ1.50 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు: ఎస్ఐ

కంచిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్ఐ పారినాయుడు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్, హరిప్రసాద్, దాసు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈవో

కంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఈవో తిరుమల చైతన్య కోరారు. మంగళవారం సోంపేట మోడల్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్‌సమావేశం, తహసీల్దార్ కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొనగా, జాడుపూడి కేజీబీవీ పాఠశాల తనిఖీచేశారు. కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేసి కంచిలి బీసీ బాలుర హాస్టల్‌లో రాత్రి బసచేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్, రజనీకుమారి, గుల్ల రామారావు పాల్గొన్నారు.

అనుభవం ఉన్నవారికే పదోన్నతులు ఇవ్వాలి

గుజరాతీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం బోధన అనుభవమున్న ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలని బీటీఏ నాయకులు కోరారు. విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా ప్రవేశించి బోధనలో అనుభవంలేని వారికి ఏడీలుగా, డీవైఈవోలుగా, డీఈవోలుగా పదోన్నతులు పొందుతున్నారని తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు మంగళవారం బీటీఏ జిల్లా అధ్యక్షులు ఎస్.రమేష్‌బాబు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

శ్రీకాకుళం క్రైం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో రామకృష్ణకు చెందిన శ్రీకాశి విశ్వనాథ్ వెల్డింగ్ షాపు మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల దగ్ధమయ్యింది. ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే స్థానికులు అగ్నిమాపకఅధికారులకు సమాచారం తెలియజేశారు.దీంతో అగ్నిమాపక అధికారులు అక్కడకు చేరుకుని ఏడీఎఫ్ఓ వరప్రసాద్ ఆధ్వర్యంలో మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే షాపు కాలిపోవడంతో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల సుమారు గంట సమయం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది.

నిబంధనలు అతిక్రమించిన సంస్థ యజమానులకు జైలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఔషధ చట్ట నిబంధనలు అతిక్రమించినాసిరకం మందులు తయారుచేసిన హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఎతిక్స్ హెల్త్ కేర్ కంపెనీ యాజమానులకు జైలు శిక్ష జరిమానా విధిస్తూ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి కేఎం జామృత్‌బేగం మంగళవారం తీర్పునిచ్చారు. ఈమేరకు డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రరావు మంగళవారం ఒక ప్రకటన విడుదలచేశారు. 2017 అక్టోబరు 30న ఎతిక్స్ కంపెనీలో అప్పటి శ్రీకాకుళం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ తనిఖీచేశారు. ఆర్బిజ్-2డి ట్యాబ్లెట్లను విశ్లేషణ నిమిత్తం నమూన సేకరించి ల్యాబ్‌కు పంపగా కొన్ని ప్రమాణాలు లేవని గుర్తించారు. ఈ మేరకు యాజమానులు ఎం.డానియల్, ఎస్.దయరాజ్, కంపెనీపై కూడా కేసు నమోదు చేశారు. సీనియర్ ఏపీపీ పి.సుశీల వాదనలు వివరించారు.కేసు వాదోపవాదనలు పరిశీలించిన న్యాయాధికారి మంగళవారం ఇద్దరు యజమానులు, కంపెనీకి 25 వేలు చొప్పున రూ.75వేలు జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఏడీ పేర్కొన్నారు.

పునాదులు వేశారు.. పూర్తిచేయడం మరిచారు

●అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు ● ఇదీ పలాసలో ఇండోర్ స్టేడియం పరిస్థితి



పునాదుల్లో ఆగిపోయిన ఇన్‌డోర్ స్టేడియం

పలాస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసి పునాది వరకు పనులు చేపట్టగా, ఇంతలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు పూర్తిచేయడం మరిచిపోయింది. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద 2018 జూన్ 11న అప్పటి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించడానికి ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేశారు. రెండు భారీ షటిల్ కోర్టులతోపాటు సమావేశ మందిరం, ఆఫీసు గదులు నిర్మించడానికి పనులు ప్రారంభించారు. పునాదులు పూర్తయ్యే సరికి టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఇంతలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజకీయకారణాల వల్ల స్టేడియం నిర్మాణంనిలిపివేసింది. ప్రస్తుతం కూటమిప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రతి మండలంలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రకటించడంతో ఆగిపోయిన స్టేడియంపై ఆశలు చిగురించాయి.

'స్వచ్ఛ శ్రీకాకుళం' లక్ష్యం కావాలి

● పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం ● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



వ్యక్తిగత మరుగుదొడ్డి మంజూరుపత్రాన్ని అందిస్తున్న రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శ్రీకాకుళం మన లక్ష్యం కావాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మంగళవారం బలగలోని చంద్రయ్య కాలనీ, అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని టాయిలెట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ప్రారంభించారు.తొలుత చెత్త తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో 26 కమ్యూనిటీ మరుగుదొడ్లకు గాను 14 పనిచేస్తున్నాయని, మిగిలిన వాటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీకళాశాల, లైబ్రరీభవనం, డేఅండ్‌నైట్ కూడలి వద్ద మహిళలకు పింక్ మరుగుదొడ్లను ఏర్పాటుచేస్తామని తెలిపారు.ఈసందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు పత్రాలు కేంద్రమంత్రి అందజేశారు. అనంతరం మునిసిపల్, పంచాయతీ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సమావేశంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీపీవో కె.భారతి సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డ్వామా పీడీ సుధాకర్, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు, పీఎంజే బాబు పాల్గొన్నారు.

సంప్రదాయ గురుకులం అభివృద్ధికి సహకరించండి

● ముఖ్యమంత్రిని కలిసిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, గురుకులం డైరెక్టర్ స్వాతీసోమనాథ్

అరసవల్లి/శ్రీకాకుళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్లేపల్లి సముద్ర తీరంలో ఉన్న సంప్రదాయ గురుకులం అభివృద్ధికి సహకరించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, గురుకులం డైరెక్టర్, నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్ కోరారు. ఈ మేరకు వారు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేశారు. కాగా శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా, అవి పరిశీలించి మంజూరుచేసిన నిధులను సీఎం లబ్ధిదారులకు ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో అందజేశారు.

నామినేటెడ్ పదవుల నాలుగో జాబితా విడుదల

● వివిధ కార్పొరేషన్లల్లో పలువురికి డైరెక్టర్ పదవులు

శ్రీకాకుళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు సంబంధించి నాలుగో జాబితాను మంగళవారం రాత్రి విడుదలచేసింది.ఈ మేరకు పలువురికి వివిధ కార్పొరేషన్లల్లో డైరెక్టర్లగా నియమిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్లగా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు దాసరి రాజు, టెక్కలి నియోజకవర్గానికి చెందిన ఇప్పలి జగదీశ్వరరావు యాదవ్‌ను నియమించారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాతపట్నం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు భాస్కర్ గౌడ్‌ను నియమించారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆమదాలవలస టీడీపీ నాయకుడు బోనెల అప్పారావును నియమించారు.

పీఎం సూర్యఘర్ లక్ష్యాలను అధిగమించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో అధిగమించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో వివిధ శాఖలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తొలుత ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి జిల్లాలో పీఎం సూర్యఘర్ పై చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు, ట్రాన్స్‌కో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మునిసిపాలిటీల్లో పనులు, అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. గృహనిర్మాణాల పురోగతి, లక్ష్యాలు, జియో ట్యాగింగ్‌పై ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. పన్నుల వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, కొవ్వాడ ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, ఉప కలెక్టర్ పద్మావతి, ఏవో త్రినాథస్వామి, డీపీవో భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి పాల్గొన్నారు. కాగా 2024-25లో రబీ సీజన్‌కు సంబంధించి పీఎం పంటల బీమా పథకం పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.

నైపుణ్యంతో ఉజ్వల భవిత: వీసీ



మాట్లాడుతున్న రజని

ఎచ్చెర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం పెంపొందించుకోవడంతో ఉజ్వల భవిత పొందవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పీటర్ పెర్డినాండ్ డ్రక్కర్ జయంతి పురస్కరించుకుని మంగళవారం మేనేజ్‌మెంట్ డే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.సంతోష్ రంగనాథ్, వర్సిటీ పూర్వపు ఛైర్మన్, బీవీఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేం

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పురపాలక సంఘ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీలో వరల్డ్ టాయిలెట్స్‌డే పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన పారిశుధ్య కార్మికులు శ్రీనివాసరావు, జమ్మన వాసుదేవరావు, జల్లేపల్లి వాసుదేవరావును సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ జాన్సన్, ఆర్ఐ గోవిందరావు ఉన్నారు.

ఎన్టీఆర్ ఉన్నతపాఠశాల అభివృద్ధికి సాయం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ ఉన్నతపాఠశాల అభివృద్ధికి 1965-66లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆర్థికసాయం చేశారు.ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ మునిసిపల్ ఉన్నతపాఠశాల సమావేశం నిర్వహించారు. నిర్వాహకులకు లక్షా 34 వేల రూపాయలు అందజేశారు. సమావేశంలో పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు ఎల్.రామలింగస్వామి, విశ్రాంత బ్యాంకు అధికారి బాపయ్య పంతులు, పి.మల్లేశ్వరరావు, ప్రభాకరరావు, వీజీకే మూర్తి, ఎ.రామ్మోహనరావు, టి.బాలమురళీకృష్ణ, తెలుగు రామారావు, జె.ప్రకాష్, యూవీ రమణ, నరసింగరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

అరసవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్లకార్డులతో ప్రదర్శన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంపేట ఐటీడీఏ మన్యం పార్వతీపురం జిల్లాలోకి వెళ్లిపోయిందని, జిల్లాల విభజన శాస్త్రీయంగా జరుగలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఐటీడీఏ ఏర్పాటుకు తక్షణమే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.68.85 లక్షలు

అరసవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీలను మంగళవారం లెక్కించారు. ఆదిత్యఆలయ అనివెట్టి మండపంలో అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు,ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షణలో ఈవో యర్రంశెట్టి భద్రాజీ ఆధ్వర్యంలో 84 రోజులకుగాను లెక్కించగా రూ.68,85,700 ఆదాయం లభించింది. బంగారం 25 గ్రాములు, వెండి కేజీ 600 గ్రాములు, యుఎస్ డాలర్లు ఐదు, లీరసి-15, నేపాల్ -50, దిర్హామ్స్‌జ10, కాంబోడియా నయారా-500 వచ్చాయని ఈవో తెలిపారు.శ్రీహరిసేవా, సత్యసాయి సేవాసమితి, శ్రీవారి సేవా సమితి సభ్యులతో లెక్కింపును నిర్వహించగాకార్యక్రమంలో సీనియర్ సహాయకులు రవికుమార్, సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్లు ఏ.శ్రీనివాస్, శోభనాద్రాచార్యులు, జూనియర్ అసిస్టెంట్లు రమణమూర్తి, ఎం.కావ్యశ్రీ పాల్గొన్నారు.

సీజ్ చేసిన కలప తరలింపునకు యత్నం

●అడ్డుకున్న ఏటోడ్డుపర్త గ్రామస్థులు
● టేకు కలప నరికివేతపై కేసు నమోదు



చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన దుంగలను ఓ వ్యక్తిపుష్ప సినిమా తరహాలో రాత్రివేళ వాహనాల్లో తరలించడానికి ప్రయత్నించాడు. దీంతో బూర్జ మండలంలో గల ఏటోడ్డుపర్త గ్రామస్థులు మంగళవా రం అడ్డుకున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి సాయిరాం కథనం మేరకు.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ అటవీరేంజ్ పరిధిలో గల బూర్జ మండలంలో గల ఏటోడ్డుపర్తలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమతి లేకుండా గ్రామంలో ఉన్న 26 టేకు చెట్లను నరికాడు. వీటిలో 13 చెట్లు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయి.ఆ 13 చెట్లు కలపను బూర్జ తహసీల్దార్‌కు అప్పగించా రు. జిరాయితీ స్థలంలో ఉన్న టేకు చెట్లను కూడా అనుమతిలేకుండా నరికినట్లు గుర్తించి శ్రీకాకుళం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు అటవీశాఖ సిబ్బంది కేసు నమోదుచేశారు. కాగా ఏటోడ్డుపర్త గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఓ ప్రజాప్రతినిధి అండదండలతో కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు అదే గ్రామానికి చెందిన ఎందవ అప్పలనాయుడు, టంకాల బెనర్జీ విలేకరులకు తెలిపారు. ఈ వ్యవహారంపై బూర్జ రెవెన్యూ అధికారులు పోలీస్, అటవీ అధికారులకు ఫిర్యాదుచేశారు. వారు వాటిని సీజ్ చేసి వేలంపాట ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూర్చడానికి చర్యలు తీసుకున్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

అరసవల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ నాయకుడు చాపరవెంకటరమణ, కార్యవర్గసభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్‌చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న ఈ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం పునరాలోచించాలని, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, ఆర్.ప్రకాష్, కొత్తకోట అప్పారావు, కె.సూరయ్య, చిన్నారావు, ఏ.లక్ష్మి, ఎం.గోపి, మహేష్, ఎం.యుగంధర్, శ్రీను, లండ బాబూరావు, చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

టైలరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సులకు శిక్షణ

ఎచ్చెర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో వచ్చే నెల రెండో తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19-45 ఏళ్లలోపు వయసుగల గ్రామీణప్రాంత మహిళలు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణా కాలవ్యవధి 30 రోజులు కాగా, ఉచితంగా భోజన వసతిసౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగలమహిళలు ఫోన్‌నెంబర్లు 79933 40407, 95534 10809కు సంప్రదించాలని కోరారు.

సచివాలయం తరలింపుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ఆమదాలవలస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపేట పంచాయతీ పరిధిలోని దండేవలసలో గ్రామ సచివాలయ తరలింపుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని శాసనసభ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన సువ్వారి గాంధీ తెలిపారు. బొడ్డేపల్లిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దండేవలసలో ప్రజాధనంతో నిర్మించిన భవనాలను మూసివేసి చింతలపేటకు టీడీపీ ప్రభుత్వం తరలించుకుపోవడం సరికాదన్నారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని తెలిపారు.

మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తొలగించిన శానిటరీ మేస్త్రీలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ మునిసిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు మాట్లాడుతూ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా అధికారులు సమస్య పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావు, ఎ.రవి, టి.షణ్ముఖరావు, మునిసిపల్ యూనియన్ నాయకులు జె. గురుమూర్తి, పార్థసారధి,గణేష్ పాల్గొన్నారు.

కత్తివరం వీఓఏపై విచారణ

కంచిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కత్తివరం గ్రామానికి చెందిన వీఓఏ నీలవేణిపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీఎం సనపలప్రసాద్ మంగళవారం విచారణ నిర్వహించారు. వీఓఏ అవకతవకలకు పాల్పడ్డారని కలెక్టర్‌గ్రీవెన్స్‌లో కామేశ్వరరావు ఫిర్యాదుచేయడంతో విచారణకు ఆయనకు ఆదేశించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ విచారణలో సేకరించిన సమాచారాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. స్త్రీనిధి, గ్రామైక్య సంఘంలో కలిపి సుమారుగా రూ.20 లక్షలు వరకు తేడాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మాధవి, ప్రమీల, పాపారావు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నేర నియంత్రణకు చర్యలు

శ్రీకాకుళం క్రైం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):డ్రోన్‌కెమెరాలతో నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీమహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారంశ్రీకాకుళంలోని ఫాజుల్ బాగ్‌పేట, దత్తాత్రేయఆలయం వెనుయక భాగంలో ఉన్న ఖాళీ ప్రాంతం, నాగావళి నదీ పరివాహక ప్రాంతంలోని పెద్దరెల్లి వీధి, డే అండ్‌నైట్ కూడలి, శాంతినగర్ కాలని,నాగావళి రివర్‌వ్యూపార్క్,రిమ్స్, బలగ మత్స్యశాఖ కార్యాలయం ప్రాంతాల్లో పోలీసు యంత్రాంగం డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు.





'అపార్' ఇక్కట్లు తొలగేనా?

● కార్యాలయాల చుట్టూ విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రదక్షిణలు

పలాస/పలాస రూరల్/కోటబొమ్మాళి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అపార్ (ఆటో మెటిక్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టర్) ప్రక్రియలో పలు సమస్యలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల పుట్టిన తేదీ, పేరులో తప్పిదాలు, నమోదులో సాంకేతిక ఇబ్బందులతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఆన్‌లైన్‌లో ఏమాత్రం అజాగ్రత్త వహించినా వివరాలు అప్‌లోడ్ కాని పరిస్థితులు ఎదురవుతున్నాయి. నమోదులో కొన్ని పాఠశాలల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కూడా ఇబ్బందులు తప్పడం లేదు. పుట్టిన తేదీకి సంబంధించి మునిసిపల్, పంచాయతీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదం డ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. మున్సిపల్ రికార్డుల్లో నమోదైతేనే సర్టిఫికెట్ జారీకి అవకాశం ఉంటుంది. ఒకవేళ సర్టిఫికెట్ లేకుంటే తహసీ ల్దార్ విచారణ చేసి ఆర్డీవోకు పంపాల్సి ఉంటుంది. అక్కడి నుంచి నిరభ్యం తర పత్రం వస్తేనే తప్ప మున్సిపల్ రికార్డుల్లో నమోదు కాదు. ఈ విధం గా చేయాలంటే కనీసం నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి పంచాయతీల్లోనూ నెలకొంది. ఇది ఒక్క విద్యార్థిని సమస్య కాదు. వేలాది మంది విద్యార్థులు అపార్ నమోదు వల్ల పడుతున్న ఇబ్బందులు. అలాగే పేర్లు, చిరునామాలు, పుట్టిన తేదీల్లో లోపాలుండడంతో వాటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి పాఠశాల రికా ర్డుల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ తప్పులు లేకుండా చేయాల్సి ఉంది. గతంలో విద్యార్థుల పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేకపోయినా వారు చెప్పిన మేరకు నమోదు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించి ఎటువంటి సర్టిఫికెట్లు లేకపోవడంతో అపార్‌లో నమోదవడం లేదు. దీనిని సాకుగా తీసుకుని కొందరు దళారులు అదనపు వసూళ్లు చేస్తున్నా రన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపార్ నమోదుకు మార్చి నెలాఖరు వరకు సమయం ఉన్నా ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో పరుగులు పెట్టాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వేచి ఉన్న తల్లిదండ్రులు, విద్యార్థులు



మున్సిపల్ కార్యాలయంలో వివరాలు సరిచేయించుకుంటున్న దృశ్యం

15 రోజులుగా తిరుగుతున్నా..



నా కుమారుడు జనన ధ్రువపత్రంలో సవరణ కోసం పనులు మానుకుని 15 రోజులుగా తిరుగుతున్నా. రోజుకో సాకు చెబుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. ఉపాధ్యాయులు చేయాల్సిన పనులు కూడా మాతోనే చేయించడం వల్ల పూట గడవడం లేదు. మేం చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాం.

- ఉప్పాడ అయ్యప్ప, చిన్నహరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి మండలం

నోటరీ లేకున్నా సర్టిఫికెట్లు ఇవ్వాలి

పుట్టిన తేదీకి సంబంధించి నోటరీ లేకపోయినా సర్టిఫికెట్ ఇవ్వాలని ఆదేశాలున్నాయి. విద్యార్థుల వివరాలు ఇవ్వాలని హెచ్ఎంలను కోరాం. వారు తమ కార్యాలయాలకు రాకుండానే నేరుగా సంబంధిత పత్రాలు అందిస్తున్నాం. మంగళవారం సాయంత్రం నాటికి 224 రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చామన్నారు. రూ.10 స్టాంపులు బ్లాక్‌లో అమ్ముతున్నారన్న విషయం తెలుసుకుని వాటిని సైతం నేరుగా తీసుకుని ఇస్తున్నాం

-టి.కల్యాణచక్రవర్తి, తహసీల్దార్, పలాస

క్రైం కార్నర్

కులం పేరుతో దూషించిన కేసులో మూడేళ్లు జైలుశిక్ష

సంతబొమ్మాళి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కులంపేరుతో దూషించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ శ్రీకాకుళం 4వ అదనపు ఎస్సీ, ఎస్టీ న్యాయాధికారి ఎం.ఫణికుమార్ మంగళవారం తీర్పు చెప్పారని సంతబొమ్మాళి ఎస్.ఐ వై.సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. 2022 ఏప్రిల్ 19న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నర్సాపురంలో మోడి భాస్కరరావు ఇంటికి పరామర్శకు వచ్చి వెళ్లారు. అదేరోజు రాత్రి 7 గంటలకు ఫిర్యాదుదారుడు కురాకుల అప్పారావు ఇంటికి వెళ్లేందుకు మోడి భాస్కరరెడ్డి ఇంటి ఎదుట సిమెంట్ రోడ్డుపైకి రాగానే అదే గ్రామానికి చెందిన నాయినిపాత్రుని ముకుందరెడ్డి బైక్‌తో అతివేగంగా వచ్చి అప్పారావు ఎడమ చేతిని ఢీకొన్నాడు. ఈ నేపథ్యంలో నెమ్మదిగా నడప వచ్చుగా అని అప్పారావు అనడంతో ముకుందరావు కులం పేరుతో దూషించి చెంపపై కొట్టినట్లు అప్పారావు సంతబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి విచారణ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పీపీ రఘురాం ఈ కేసును వాదించగా ముకుందరెడ్డిపై నేరం రుజువైంది. దీంతో ముద్దాయికి మూడేళ్ల జైలుతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్త దిబ్బలపాలెంలో వలలు దగ్ధం



దగ్ధమవుతున్న వలలు

ఎచ్చెర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.మత్స్య లేశం పంచాయతీ పరిధిలోగల కొత్త దిబ్బలపాలెం సముద్రతీరంలో మత్స్యకారులు భద్రపరిచిన వలలు మంగళవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కొత్తదిబ్బలపాలెం గ్రామానికి చెందిన చీకటి పండోడు, రాము, సూరాడ కురమయ్యకు చెందిన సుమారు రూ.15 లక్షల విలువ చేసే వలలు కాలిబూడిదయ్యాయి. మత్స్యకారులు చేపలవేటకు వినియోగించే వలలను తీరంలోనే పూరి గుడిసెల్లోనే భద్రపరుస్తారు. ఈ క్రమంలో గుడిసెల్లో భద్రపరిచిన వలలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. చేపల వేటకు వేకు వజామున తెప్పలు, బోట్లపై బయలుదేరిన వెళ్లిన మత్స్యకారులు సాధారణంగా ఉదయం 10, 11 గంటల సమయంలో ఒడ్డుకు చేరుకుంటారు. ఇదే సమయంలో వలలు భద్రపరిచిన గుడిసెల్లో మంటలు చెలరేగడంతో మత్స్యకారులు పరుగులు తీసినా వలలను కాపాడుకోలేకపోయారు. ఇదే పంచాయతీ తీరంలోనే గత నెలలో రాత్రి సమయంలో ఇదే తరహాలోనే వలలు దగ్ధమైన విషయం విదితమే. వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కంచిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపేటలో 15 విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఎస్.లీలారాణిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలి పారు. ఎంఎస్‌పల్లిలో దాడులు నిర్వహించి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఎన్.స్వప్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించినట్లు చెప్పారు. బెల్ట్ షాపులు, సారా కేసుల్లో ముగ్గురు నిందితులను సోంపే ట ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గంజాయి మొక్క పెంచిన వ్యక్తిపై కేసు

రణస్థలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోష్ట గ్రామానికి చెందిన పి.నూకరాజు తన ఇంటి పెరటిలో గంజాయి మొక్కను పెంచడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం పోలీసులు పరిశీలించగా గంజాయిమొక్క దొరికింది. దీంతో జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి నూక రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

మందుగుండు సామగ్రి సీజ్

పలాసరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పట్టణం ఓ రెసిడెన్సీ వద్ద వాహనంలో మందుగుండు సామగ్రిని నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా మంగళవారం కాశీబుగ్గ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మందుగుండు సామగ్రి విలువ రూ.2 లక్షలుంటుందని అంచనా వేశారు. కాశీబుగ్గ ఎస్ఐ చంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బూడిదైన ఉపకరణాలు

పోలాకి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలాకి కేంద్రంలోని బాలుర బీసీ వసతి గృహం సమీపంలో మంగళవారం సురవరపు దమయంతి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ ఉపకరణాలతో పాటు వస్తువులు కాలిపోయాయి. ఈ సమయంలో ఇంటిలో ఎవరూ లేరు. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులంతా శ్రీముఖలింగం దర్శనం కోసం వెళ్లారు. రెండు గంటల వ్యవధిలోని ఇల్లంతా మసిబారి, సెగలు రావడంతో సమీపంలోని వారు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా విజయవాడలో ఉపాధి రీత్యా ఉంటున్న దమయంతి కుమారుడు, భార్య పోలాకి వచ్చి మంగళవారం శ్రీముఖలింగం జాతరకు వెళ్లారని, ఈలోగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. కుమారుడు లక్ష్మణరావు ల్యాప్‌టాప్, విలువైన దుస్తులు, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయని బాధితురాలు దమయంతి ఆవేదన వ్యక్తంచేశారు.

కూనలచ్చున్నాయుడుపేటలో చోరీ

● 8 తులాలు బంగారం, 74 తులాల వెండి అపహరణ



తాళాలు పగులగొట్టిన బీరువా

జలుమూరు, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): కూనలచ్చున్నాయుడుపేట గ్రామానికి చెందిన సనపల నాగరాజు ఇంటిలో జరిగిన దొంగతనంలో 8 తులాల బంగారం, 74 తులాల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇంటి యజమాని నాగరాజు చెన్నైలో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య లక్ష్మీ కూనలచ్చున్నాయుడు పేటలో ఉంటూ గత నెల 27న చెన్నై వెళ్లింది. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి రెండు బీరువాలు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే తాళాలు వేసిన ఇంటిని బాధితురాలు సనపల లక్ష్మీ తల్లి కూన జయమ్మ ఆదివారం ఉదయం చూసేసరికి తాళాలు వేసి ఉన్నట్లు ఆమె తెలిపారు. దీన్ని బట్టి చోరీ ఆదివారం రాత్రి గాని, సోమవారం రాత్రి గాని జరిగి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. సమాచారం అందుకున్న క్లూస్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించింది. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా



కొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ కోరారు. ఈ మేరకు కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. రైతులు, ప్రజల పాలిట ఉరి తాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు నిలుపుదల చేయాలన్నారు. నిమ్మక అప్పన్న, రమేష్, దుర్గారావు, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

ఆంధ్రలో దొంగిలించి.. ఒడిశాలో విక్రయానికి యత్నం

● 20 ద్విచక్రవాహనాల రికవరీ
● ఆరుగురు పాత నేరగాళ్ల అరెస్టు



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



శ్రీకాకుళంక్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలిం చిన కొంత మంది పాత నేరస్థులను పోలీసులు అరెస్టుచేసి వారి నుంచి రూ.15.5 లక్షల విలువైన 20 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. వీరంతా ఆంధ్రలో దొంగిలించి.. ఒడిశాలో విక్రయానికి యత్నిస్తున్నారు. ఈమేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు మైలపల్లి అర్జునరావు ఆర్థిక ఇబ్బందుల వల్ల పాత నేరస్థులు కారుణ్య జగదీష్, జడ్డాడ సోమేశ్వరరావు, సప్ప హరీష్, మదాసు ధనుష్, దారపు శేషగిరి, ఏరుపల్లి బాలాజీలకు డబ్బులు, రూమ్ ఇచ్చి వారితో రాత్రి పూట ద్విచక్రవాహనాలు దొంగతనాలు చేయించేవాడు. ఈ మేరకు ఆమదాలవలస, కాశీ బుగ్గలో ఐదు చొప్పున, శ్రీకాకుళం రూరల్, విజయ నగరం వన్ టౌన్, విశాఖ త్రీ టౌన్, లావేరు, ఎచ్చెర్లలో ఒక్కొక్కటి చొప్పున, వీటితోపాటు మరో ఐదు ద్విచక్ర వాహనాలను ఏడుగురు దొంగిలించారు. వీటిని ఆంధ్రలో అమ్మితే పట్టుబడతామని ఒడిశాలో విక్రయిస్తే ఎవరికీ అనుమానం రాదని భావించారు. అర్జునరావు ఒడిశాలోని గజపతి జిల్లా మినిగాన్‌కు చెందిన స్నేహితుడు దారపు శేషగిరి, సరుబుజ్జిలి మండలం తురకపేటకి చెందిన బంధువైన ఏరుపల్లి బాలాజీ సాయంతో దొంగి లించిన ద్విచక్ర వాహనాలను ఒడిశాలో అమ్మడానికి ప్రయత్నిం చాడు. ఈ క్రమంలో ఆమదాలవలస స్కూల్ గేట్ వద్ద మంగళవారం ఎస్ఐ వెంకటేష్ వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డారు. కారుణ్య జగదీష్ ఇటీవల ఎన్‌డీపీఎస్ కేసులో ఆమదాలవలస పోలీసులకు పట్టుబడ్డాడు. మిగిలిన ఆరుగురు తాజాగా ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పట్టుబడ్డారు. ఈ ఆరుగురులో సోమేశ్వరరావు, హరీష్‌లపై బొబ్బిలిలో మూడేసి కేసులు, జగదీష్‌పై ఆమదాలవలసలో రెండు పాత కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్పీ సీఐ ఇమాన్యుయల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బొందికారి వంతెన పరిశీలన

హరిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చీపి పంచాయతీ బొందికారి, బుడంబో మార్గంలో బొందికారి వంతెనను ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. వంతెన పూర్తిగా మరమ్మతులకు గురై ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిపై పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే గౌతు శిరీషా దృష్టికి తీసు కెళ్లారు. ఆమె సూచనల మేరకు ఐటీడీఏ డీఈ ఈ బలివాడ కృష్ణ కుమార్, ఏఈఈ అబ్రహం వంతెనను పరిశీలించారు. వంతెను పూర్తిస్థాయి లో నిర్మించడంతో పాటు ఇరువైపులా అర కిలోమీటరు మేర రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపు తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'సార్వత్రిక' ప్రవేశాలకు ఫీజు గడువు 25 వరకు పెంపు

టెక్కలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపరిషత్ ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీలోగా అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించిందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం దాసరి నాగభూషణరావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అపరాధ రుసుంతో ప్రవేశం పొందాలని, నేరుగా స్టడీ సెంటర్‌కు వచ్చి ఫీజు చెల్లించ వచ్చన్నారు.

వచ్చే ఏడాది బాలియాత్ర ట్రేడ్ ప్రదర్శన

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో వచ్చే ఏడాది బాలియాత్ర ట్రేడ్ ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఒడిశా రాష్ట్రం కటక్‌లో సోమవారం జరిగిన బాలియాత్ర ట్రేడ్ ఎగ్జిబిషన్‌కు ఆయన హాజర య్యారు. ఇటువంటి యాత్ర కటక్‌లోని మహా నది తీరాన ఎప్పటి నుంచో జరుగుతోందని, అక్కడ పండుగ కులాలకు అతీతంగా జరుపు తారన్నారు. ఉదయగిరి గుహల్లో కళింగ చక్ర వర్తి ఖారవేలుని హతి గుంప శాసనాలు పరిశీలించామన్నారు. బాలిజాతరపై పూర్తి అధ్యయనం చేసిన తరువాత ఏర్పాటుకు అంకు రార్పణ జరుగుతుందన్నారు.

చెత్త కేంద్రాలపై అవగాహన కలిగించాలి

నరసన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించే విధానంపై ప్రజలను అవగాహన చేయాలని సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజర్ శ్రీనివాసన్ అన్నారు. మంగళవారం స్థానిక ఒక స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసన్నపేటను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని, దీనిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. కాన్యక్రమంలో నేతలు గొద్దు చిట్టిబాబు, జామి వెంకట్రావు, తంగుడు శ్రీధర్, ఉణ్న రంగనాథ్, సోమేశ్వరరావు, చింతు రామారావు, కోరాడ చంద్రభూషణగుప్త తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయానికి గండి

● దర్శనం టిక్కెట్ల రీసైక్లింగ్



రీ సైక్లింగ్ చేసిన రసీదుల్లో కొన్ని..

టెక్కలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రం రావివలస ఎండలమల్లన్న ఆలయ ఆదాయానికి వలంటీర్లు గండికొడుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా వివిధ దర్శనాలకు టిక్కెట్లు విక్రయించారు. అయితే వాటిని చింపి వేయకుండా తిరిగి మళ్లీ విక్రయించిన ఘటన వెలుగులోకి రావడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు దర్శనాలకు అమ్మే ఆన్‌లైన్ టిక్కెట్లు తిరిగి రీ సైక్లింగ్ అవుతున్నట్లు వలంటీర్లుగా వ్యవహరిస్తున్న రావివలస గ్రామస్థులు కొందరు గుర్తించడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. విషయం తెలుసుకున్న ఈవో గురునాథరావు ఆరాతీసి సదరు వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టెక్కలి ప్రాంతానికి చెందిన ఒకరిద్దరు ఈ తరహా టిక్కెట్లు రీ సైక్లింగ్‌కు పాల్పడినట్లు సమాచారం. దీనిపై ఈవో గురునాథరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా రీ సైక్లింగ్ వ్యవహారం తన దృష్టికి రాలేదని, ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పర్యవేక్షించారని ఆయన తెలిపారు.

న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి సన్యాసినాయుడు

నరసన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌జైలును సందర్శించారు. క్షణికావేశాలకు లోను కావద్దని, రిమాండ్‌లో ఉన్న ఖైదీల్లో మార్పు రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



టెక్కలి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టెక్కలి/పలాస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని టెక్కలి, పలాసల్లో కాంగ్రెస్ నేతలు మంగళవారం నిర్వహించారు. టెక్కలి ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి పేడాడ పరమేశ్వరరావు, పలాస ఇందిరా జంక్షన్ వద్ద పీసీసీ డెలిగేట్ తంగుడు వీర్రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 20 సూత్రాల ఆర్థిక కార్య క్రమం ద్వారా దేశాభివృద్ధికి, బడుగులు ఉన్నతికి ఇందిరా గాంధీ ఎన లేని కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశాభివృద్ధి, సమాజ ప్రగతి సాధ్యపడుతుందన్నారు కార్యక్రమాల్లో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కోత మధు, నేతలు పొట్నూరు ఆనందరావు, టీబీజీ గుప్త, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఉమామ హేశ్వరరావు, తంగుడు సత్యం, మల్లా కామేశ్వరరావు, మల్లా రామలింగేశ్వరరావు, ట్రాలీరిక్షా కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం లేక ఇక్కట్లు

పలాసరూరల్,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఎటువంటి తాగునీటి సదు పాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ సోమ వారం మీకోసం కార్యక్రమం నిర్వహి స్తుండడంతో వివిధ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు అధిక సంఖ్యలో ప్రజలు కార్యాలయానికి వస్తున్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంతో దాహార్తితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన కార్యాలయ నిర్మాణం చేపట్టినా వచ్చిన ప్రజలకు ఎటువంటి సదుపాయం కల్పించడక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి నీటి సదుపాయం కల్పించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

పంచభూతాలతో వ్యాధుల నివారణ

ఎల్.ఎన్.పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని పంచభూతాలతో మానవ సంబంధాలను పరిగణనలోకి తీసుకుని వ్యాధులను నివారించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.విలియమ్స్ అన్నారు. తురకపేట పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచభూతాలతో మానవుడికి ఉన్న సంబంధాలను ఉపయోగించి వ్యాధులను ఏ విధంగా నివారించవచ్చో వివరించారు. మొక్కల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నీతూ, ఎ.లక్ష్మీదీప్, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిడ్డంగులను నిర్మించండి: ఎంజీఆర్

పాతపట్నం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో పౌరసరఫరాల శాఖ గిడ్డంగులను నిర్మించాలని సంబంధిత మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఎక్కువ విస్తీర్ణం ఉన్న నియోజకవర్గం కావడంతో శాఖాపరంగా నాణ్యమైన సేవలు అందించేందుకు పాతపట్నం, హిరమండలం ఏఎంసీల ప్రాంగణాల్లో గిడ్డంగులను నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వీరనారి ఝాన్సీలక్ష్మీభాయి

పాతపట్నం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచితంగా పోరాం చేసిన మహనీయురాలు ఝాన్సీలక్ష్మీభాయి అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయి 196 జయంత్యుత్సవం మంగళవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ వి.అర్చన, విశ్రాంత ఉపాధ్యాయులు బందన శ్రీనివాసరావు, పారశిల్లి రామరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రతీ విద్యార్థికి అపార్ కీలకం

మందస,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అపార్ నమోదు అవసరమని డీఈవో ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మంగళవారం మందస జడ్పీ పాఠశాలలో అపార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అపార్ ఐడీ జారీకి అవసరమైన పుట్టిన తేదీ, ఆధార్, స్కూల్ సర్టిఫికెట్ వివరాల్లో తేడాలను సరిచేయాలన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 10వతరగతి వరకు అపార్ నమోదు ప్రక్రియ 81 శాతం పూర్తి చేశామని, మండలంలో 82శాతం నమోదు పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంఈవో ఎం.లక్ష్మణరావు, హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

అపార్ నమోదుపై ఆరా

నందిగాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ నమోదుపై జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు మంగళవారం నందిగాం ఎంఆర్‌సీ భవనాన్ని సందర్శించి మండలంలో నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సీఎంవో పి.ప్రభాకరరావు, ఐఈడీ జిల్లా కో-ఆర్డినేటర్ పి.గోవిందరావు ఎంఈవో-2 ఎ.చిన్నారావుకు సూచించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

పోలాకి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి దుర్గాగిరి ఆలయ ప్రాంగణంలో బుధవారం షిర్డీసాయిబాబా, సుబ్రమణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠ బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం విగ్రహాలకు అభిషేకం, గురువారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పురోహితులు ఆరవల్లికృష్ణ శర్మ, పల్లిరాజు గురుభవానీ తెలిపారు.

క్రమశిక్షణతో చదవాలి

పోలాకి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అలవరచుకోవాలని ఎస్ఐ రంజిత్ సూచించారు. మంగళవారం పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్, ఆన్‌లైన్ ఆటలకు స్వస్తిపలకాలన్నారు. గంజాయి సేవించడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

జలుమూరు, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న సీపీఎస్, జీపీఎస్‌లను ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు డిమాండ్ చేశారు. మానవ హక్కుల దినం సందర్భంగా వచ్చేనెల 10న విజయవాడలో తలపెట్టిన చలో విజయవాడ పోస్టర్‌ను కరవంజ మోడల్ స్కూల్‌ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై నమోదు చేసిన అక్రమ కేసులను రద్దు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరావు, జనార్దనరావు, శివరామకృష్ణ, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశుగణనతో రైతులకు భరోసా

హరిపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పశుగణనతో రైతులకు భరోసా కలుగుతుందని టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. హరిపురంలో పశువైద్య సిబ్బంది నిర్వహిస్తున్న పశుగణనను మంగళవారం పరిశీలించారు. మండలంలో 20522 గృహాల్లో ఎన్యుమరేటర్లు పశు గణన నిర్వహిస్తున్నారన్నారు ఇప్పటి వరకు 2127 గృహాల్లో గణన పూర్తిచేశా మన్నారు. కార్యక్రమంల మందస, హరిపురం పశువైద్యులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కాశీబుగ్గ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ నూతన జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంస్థ జిల్లా 20వ మహాసభల సందర్భంగా ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎస్ రాము, కార్యదర్శిగా పీహెచ్ రవితో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, సీపీఐ నాయకుడు చాపర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.